
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శుక్రవారం 1 ఆగస్టు 2025



మూగ జీవాలకు అందని వైద్యం

- మందులకు అరకొర నిధులు
- వైద్యులు, సిబ్బంది కొరతతో ఇక్కట్లు
- ఇబ్బంది పడుతున్న పశుపోషకులు

7

కొమ్మల కత్తిరింపుతో అధిక దిగుబడులు

- ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బాబు
- ప్రతీ ఏడాది ఆగస్టులోపు మామిడి కొమ్మలు కత్తిరించాలి
- ఉమ్మడి జిల్లా రైతులకు క్షేత్రస్థాయిలో శిక్షణ



క్షేత్రస్థాయిలో మామిడి కొమ్మల కత్తిరింపు విధానాన్ని రైతులకు చూపుతున్న ఉద్యానవన శాఖ డైరెక్టర్ బాబు

రేపు కొల్లాపూర్‌కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాక



కొల్లాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రానికి శనివారం రానున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై శిలాఫలకాలను ఆవిష్కరణ చేయనున్నారు.

ఆగస్టు 2న ఉదయం 8 గంటలకు ప్రజాభవన్, బేగంపేట్, హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి వనపర్తి జిల్లాలోని చిన్నంబావి మండలం వెల్టూరు గ్రామానికి చేరు కోనున్నారు. అక్కడ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించి అక్కడి నుంచి 11:30నిమిషాలకు బయలుదేరి నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ మండల కేంద్రానికి 12:15 నిమిషాలకు చేరుకోనున్నారు. కొల్లాపూర్ రాజవారి బంగ్లా వద్ద 2 గంటలకు నియోజకవర్గంలోని మండల కేంద్రాలతో పాటు గ్రామాలకు మంజూరైన విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపన చేయనున్నారు.



ముళ్ల పొదలతో నిండిన కాలువ



గోనుపాడు రైల్వే ట్రాక్ దగ్గర 99వ ప్యాకేజీ కాలువలో దుస్థితి

ప్రతీసారీ ఊరింపే

- నెట్టెంపాడు 99వ, 100వ ప్యాకేజీ రైతులకు ఈ ఏడాదీ.. సాగునీరు అనుమానమే
- అధికారుల ప్రకటనతో పంటలు వేసిన రైతులు
- ప్రస్తుతం ఎండుముఖం పట్టిన పైర్లు

గద్వాల జూలై 31 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో 99వ, 100వ ప్యాకేజీ రైతులకు ఈ ఏడాది సాగునీరందించడం అనుమానంగానే ఉంది. ప్రతీసారీ సాగునీరందిస్తామని అధికారులు ఊరిస్తూనే ఉన్నారు. ఈ ఏడాది తప్పని సరిగా నీరందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు సంతోష పడ్డారు. కాలువ పరిధిలో వివిధ రకాల పంటలను సాగుచేశారు. ప్రస్తుతం నీరందాల్సిన సమయంలో కాలువకు సాగునీరందడం లేదు. పరమాల గ్రామానికి చెందిన రైతులు బుధవారం ఎక్స్‌కవేటర్‌తో కాలువలలో ఉన్న ముళ్లపొదలను తొలగించినా గోనుపాడు దగ్గర ఉన్న రైల్వేట్రాక్ దాటి సాగునీరు ముందుకు రావడం లేదు.

చిన్న పనులే.. సాగునీటికి అడ్డంకులు

నెట్టెంపాడు ప్రాజెక్టు కింద ర్యాలంపాడు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ల ద్వారా 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందులో ర్యాలంపాడు కింద 1.42లక్షలకు వానాకాలంలో సాగునీరు అందిస్తున్నారు. గుడ్డెందొడ్డి రిజర్వాయర్ కింద 58వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందులో ప్రధానమైనవి 99వ,100వ ప్యాకేజీ పనులు ఉన్నాయి. వీటిలో కొండపల్లి వద్ద ఏళ్ల తరబడి సాగిన అక్విడక్టు పనులు ఈ ఏడాది పూర్తయ్యాయి. దీంతో అధికారులు 99, 100 ప్యాకేజీల పరిధిలో రైతులకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. కానీ ఇప్పుడు ఇవ్వలేకపోతున్నారు.

> **చిన్నపైపులు తొలగిస్తాం..**
>
> గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నుంచి 99, 100వ ప్యాకేజీ కాలువలకు సాగు నీరు అందించాలనే లక్ష్యం ఉంది. అయితే అక్కడక్కడ కాలువను దాటేందుకు రైతులు చిన్నపైపులు వేసుకున్నారు. మేము అక్కడ వంతెన నిర్మాణం చేయాలి. కాలువలో నీటిపారుదలను పెంచేందుకు ఎమ్మెల్యేతో మాట్లాడి పెద్దపెద్ద పైపులు వేసి నీటిపారుదల చేస్తాం. ప్రస్తుతం 20వ కిలో మీటరు వరకు నీళ్లు వస్తున్నాయి.
>
> - రహిముద్దీన్, ఎస్ఈ, గద్వాల



గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నుంచి 6 కిలోమీటర్ల పరిధిలోని రైతులకు మాత్రమే సాగునీరు అందుతోంది. మిగిలిన 70 కిలో మీటర్ల పరిధిలోని భూములకు సాగునీరు అందడం లేదు. దీని పరిధిలో ధరూర్ మండల రైతులు పొలాలకు దాటేందుకు చిన్న పైపులు వేసుకున్నారు. దీంతో నీరు ముందుకు పారడం లేదు.

ఈ ఏడాది పక్కా..

ప్యాకేజీ 99వ, 100వ పరిధిలో దాదాపు పనులు తుదిశకు వచ్చాయని, పక్కాగా కాలువకు సాగునీరు అందిస్తామని అధికారులు ఈ ఏడాది మే మాసంలో ప్రకటించారు. దీంతో రైతులు అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. జూన్, జూలైలో వర్షాలు కురవడంతో నీటి అవసరం రాలేదు. కానీ పంటలకు ఇప్పుడు నీటి అవసరం ఏర్పడింది. సాగునీటి కోసం రైతులు బుధవారం ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువల వెంట వెళ్లి అక్కడక్కడ ఉన్న అడ్డుకట్టలు, ముళ్ల పొదలు తొలగించారు. అయినా మర్లపల్లి వరకు కాలువ తడుపు నీళ్లే వచ్చాయి. పంటలకు కావాల్సిన నీరు రాకపోవడంతో రైతులు అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు.

సీఎం ఆదేశించినా ఫలితం శూన్యం

గుడ్డెందొడ్డి రిజర్వాయర్ పరిధిలోని 99వ, 100వ ప్యాకేజీ కాలువ పరిధిలో 58వేల ఎకరాలకు సాగునీరు అందించాలంటే ఇంకా దాదాపు 480 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. అప్పుడే ప్రధాన కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సాగునీరు అందుతుంది. ఇందుకోసం ప్రభుత్వం వెంటనే భూసేకరణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇందులో 99బీ కింద 257 ఎకరాలు, 99సీ, 99డీ కింద 173ఎకరాలు, 100వ ప్యాకేజీ కింద 50ఎకరాల భూసేకరణ చేయాలని రూ.25 కోట్ల నిధులను విడుదల చేశారు. అధికారులు అనుకున్నంత వేగంగా పనులు చేయడం లేదు. ముందు ప్రధాన కాలువలో నీటిపారుదలను చేయాలని రైతులు కోరుతున్నారు.



సుంకేసుల జలాశయం గేట్లకు మరమ్మతు చేయిస్తున్న జేఈ మద్దిలేటిస్వామి

'సుంకేసుల'కు స్వల్పంగా తగ్గిన వరద

- 72 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 70 వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

6

కాశీంనగర్ లిఫ్టు ఇరిగేషన్‌కు జీవో విడుదల

- సర్వే కోసం రూ. 22 లక్షలు మంజూరు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

6

కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు

- యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ విజేందర్‌సాగర్

7

బీసీలకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ

సాధారణ కాన్పులకే ప్రాధాన్యం



నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రి స్థాయి 600 పడకలకు పెంపు

- రెగ్యులర్‌గా డయాలసిస్ సేవలు
- సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి వెల్లడి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాగర్‌కర్నూల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి):నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిని 600 పడకలకు పెంచడం ద్వారా అత్యాధునిక వైద్య సదుపాయాలను అందించనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తోట వెల్లడించారు. అన్ని విభాగాలకు నిష్ణాతులైన ప్రొఫెసర్లు ఉంటారని ఆమె తెలిపారు. రానున్న కాలంలో ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా స్థానికంగానే చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌తో పాటు నీలోఫర్ ఆసుపత్రిలో సుదీర్ఘ కాలం సేవలందించి ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఉషారాణి గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

జిల్లా ఆసుపత్రి పని తీరును ఎలా మెరుగుపరుస్తారు?

వెనకబడిన ప్రాంతమైన నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు వైద్య సేవలందించే అవకాశం రావడం నా అదృష్టం. నాకున్న అనుభవంతో మెరుగైన వైద్య సేవలందించి నాతో సహా ఆసుపత్రి సిబ్బందికీ మంచి పేరు తీసుకురావాలన్నదే నా సంకల్పం.

ఆసుపత్రిని 600పడకల స్థాయికి పెంచే యోచన నిజమేనా?

అవును నిజమే.. ప్రస్తుతం కొనసాగుతున్న ఆసుపత్రి 300 పడకల స్థాయి కాగా మెడికల్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించడంతో నర్సింగ్ కళాశాలలో మరో 270పడకల స్థాయికి పెంపొందించనున్నాం.

జిల్లా ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి సేవలందుతున్నాయి?

గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల నుంచి నిష్ణాతులైన ప్రొఫెసర్లు అందుబాటులో ఉన్నారు. దీంతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. గైనిక్, జనరల్ సర్జరీల శాతం పెరిగింది.

సాధారణప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తున్నారా?

గతేడాది సగటున నెలకు 450 ప్రసవాలు చేస్తే అందులో ఏడాదిలో 2,290 నార్మల్ డెలివరీలు, 2,350 సిజేరియన్లు జరిగాయి. అంతేకాకుండా దాదాపు 2వేల దాకా మేజర్, మైనర్ గైనిక్ సర్జరీ సేవలు అందించాం. ఇది కాకుండా దాదాపు 16వేల దాకా మైనర్, జనరల్ సర్జరీలు, 400వరకు మేజర్ సర్జరీలు జరిగాయి. ఆర్థో సర్జరీలు 900 దాకా చేశారు.

ఎన్ని ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి?

330పడకల ఆసుపత్రిలో మొత్తం 4 ఆపరేషన్ థియేటర్లు ఉండాల్సి ఉండగా వాటిలో ప్రస్తుతానికి 2 వినియోగంలో ఉన్నాయి. మరో రెండింటిని త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.

డయాలసిస్ సేవలు సక్రమంగా అందుతున్నాయా?

జిల్లా ఆసుపత్రిలో 55మంది కిడ్నీరోగులకు డయాలసిస్ సేవలందిస్తున్నాం. వారికి దాదాపు 580 సిట్టింగ్‌ల ద్వారా డయాలసిస్ సేవలందుతున్నాయి.

జిల్లా ఆసుపత్రిలో మందుల కొరతనిజమేనా?

ఈ విషయం అవాస్తవం. దాదాపు 80శాతం మందుల సరఫరా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా జరుగుతోంది. 20శాతం మందులకు సంబంధించి స్థానికంగా టెండర్లు పిలిచి కొనుగోలు చేస్తున్నాం. కుక్క, పాము కాటుకు మందులు ఉన్నాయి.

అత్యవసర వైద్య విభాగాలను ఆధునీకీకరించారా?

అత్యవసర చికిత్స విభాగాల్లో వెంటిలేటర్స్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చాం. జిల్లా లోని నాలుగు నియోజకవర్గాల నుంచి వచ్చే రోగులకు ప్రయోజనం చేకూరు తుంది.

ఆధునిక వైద్య పరీక్షలు చేస్తున్నారా?

ఇటీవల అనేక అత్యాధునికమైన పరీక్షలు చేయడానికి జిల్లా ఆసుపత్రిలో వ్యవస్థ ఏర్పడింది. సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ అందుబాటులోకి వచ్చాయి.

వయో వృద్ధుల చికిత్స కేంద్రం ఏర్పాటు చేస్తున్నారా..?

త్వరలోనే వయోవృద్ధుల కోసం ప్రత్యేక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయనున్నాం. అదేవిధంగా క్యాన్సర్ రోగులకు చికిత్స అందించే క్రమంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాం. దీని కారణంగా జిల్లా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సేవలందించే విధానానికి అంకురార్పణ జరగనుంది.

సీజనల్ వ్యాధుల ప్రభావం ఏమైనా ఉందా?

ఇప్పటి వరకు అలాంటి పరిస్థితి లేదు. సాధారణ రోజుల్లో జిల్లా ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ల సంఖ్య 900-1200మధ్య ఉంటుంది. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది.

గర్భిణులకు నెలవారి ఇంజక్షన్లు, మాత్రలు ఇస్తున్నారా?

కచ్చితంగా ఇస్తున్నాం. నెలకు 400మంది గర్భిణులకు టీటీ ఇంజక్షన్, ఐరన్ మాత్రలు ఇస్తున్నాం. ఈ ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతోంది.

వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడొద్దు

వనపర్తి రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల పరిధిలో వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆగస్టు నెలలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అన్ని మునిసిపాలిటీల పరిధిలో ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వనపర్తి మునిసిపాలిటీలో మూడు ఎమర్జెన్సీ బృందాలను ఏర్పాటు చేయలన్నారు. వర్షాల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, రోడ్ల గుంతలను వెంటనే పూడ్చాలన్నారు. అదేవిధంగా తాగు నీటిలో క్లోరిన్ లెవెల్స్ పరిశీలించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులకు మాత్రమే అప్రూవల్ ఇవ్వాలని, అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినట్లు తెలిస్తే సంబంధిత చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి లేని ప్రదేశాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై జరిమానా విధించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, మునిసిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, గణేష్, శశిధర్ పాల్గొన్నారు.



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

నల్లమల పర్యాటకానికి చెడ్డపేరు తెస్తే చర్యలు

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బ్రహ్మగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేస్తోందని, ఈ ప్రాంతానికి చెడ్డపేరు తేవాలనుకుంటే చర్యలు తప్పవని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఈ నెల 29న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'మందుబాబులకు అడ్డాగా టూరిజం లాంచి' శీర్శికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. తిరుగు ప్రయాణంలో బ్రహ్మగిరి కృష్ణానదిలో పర్యాటక శాఖ అధ్వర్యంలో నిర్వహించే అక్కమహాదేవి లాంచిని నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు దురాశతో అప్రతిష్ఠ పాలు చేయాలనుకుంటున్నారు. అంటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టూరిజం శాఖ అధ్వర్యంలో తక్షణమే లాంచిని ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక యువతకు టూరిజంలో ఉపాధి వకాశాలు కల్పించాలని, గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో నాయకులు మోయిజ్, శివ, రసూల్, సిరాజ్, జంగయ్య తదితరులు ఉన్నారు.



టూరిజం లాంచి నడుపుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



సత్రంలో అన్నదానం చేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

6

అలంపూర్ క్షేత్రంలో.. అన్నదాన సత్రం ప్రారంభం

కోటిమంది మహిళలను లక్షాధికారులను చేస్తాం

- పావలా వడ్డీకే రుణాలు
- మహిళల సాధికారతే సీఎం లక్ష్యం
- గత పదేళ్లుగా బీఆర్ఎస్ రేషన్ కార్డులు ఇవ్వలేదు
- అలంపూర్‌కు 3వేల కార్డులు ఇచ్చాం
- పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

అలంపూరు చౌరస్తా, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కోటి మంది మహిళలను లక్షాధికారులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని పుల్లూరు గ్రామ శివారులో నిర్వహించిన ఇందిర మహిళా శక్తి, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు అలంపూరు ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ బీఎం సంతోష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అలంపూరు నియోజకవర్గానికి 3వేల రేషన్‌కార్డులు మంజూరు చేసిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కోటిమంది మహిళలను లక్షాధికారులను చేసేందుకు పావలా వడ్డీకే రూ.20లక్షల దాకా రుణాలు ఇస్తున్నామని అన్నారు. వీటితో పాటు మహిళలకు పెట్రోలు బంకులు, బస్సులు ఇస్తున్నామన్నారు. అలంపూరు నియోజకవర్గంలో కమీషన్ల పర్వం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ప్రభుత్వం ఇచ్చే రేషన్‌కార్డులకు, ఇందిరమ్మ ఇళ్లకు కమీషన్లు వసూలు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ పథకాలకు ఎవరు డబ్బులు ఇవ్వొద్దని, స్వయంగా మీరే వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో అలివేలు, గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనువాసులు జిల్లా మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పావలా వడ్డీ రుణాల చెక్కును మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్

ప్రభుత్వ వైద్యుడి భార్యకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం



ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రవసం జరిగిన వైద్యుని భార్య అనూష తన బిడ్డలతో

కోస్గి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యుడి భార్య, ప్రభుత్వ ఆసుపత్రిలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. నారాయణపేట జిల్లా, కోస్గీ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ అనుదీప్ భార్య అనూష గురువారం పురుటి నొప్పులతో ఆసుపత్రిలో చేరింది. ఆమె భర్త సిబ్బందితో కలిసి కాన్పు చేశారు. మగ శిశువు జన్మించడంతో ఆ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెండవ కాన్పు కాగా, మొదటిసారి కూడా ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేయించామని, అప్పుడు ఆడబిడ్డ పుట్టిందని అనుదీప్ తెలిపారు.

'సుంకేసుల'కు స్వల్పంగా తగ్గిన వరద

- 72 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో, 70 వేల క్యూసెక్కుల అవుట్ ఫ్లో



సుంకేసుల జలాశయం నుంచి దిగువకు వదిలిన వరద నీరు

రాజోలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రం శివారులో సుంకేసుల జలాశయానికి వరద స్వల్పంగా తగ్గింది. గురువారం ఎగువ నుంచి 72 వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో, డ్యామ్ 18 గేట్లు తెరిచి 70 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ మద్దిలేటి స్వామి తెలిపారు. వరద తగ్గడంతో గురువారం డ్యామ్ గేట్లకు మరమ్మతులు చేపట్టారు. దెబ్బతిన్న రోప్‌లను మారుస్తున్నట్లు జేఈ తెలిపారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 292 మీటర్లు కాగా, ప్రస్తుతం 290.20 మీటర్లు నమోదు అవుతున్నట్లు తెలిపారు. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, 0.608 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు చెప్పారు. కేసీ కెనాల్‌కు 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు



పింఛన్ కోసం క్యూలో కూర్చున్న వృద్ధులు

చిన్నచింతకుంట , జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉంద్యాల గ్రామంలో గురువారం వృద్ధులు గ్రామంలోని పోస్టాఫీసు ఎదుట పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. ఈ సందర్భంగా వారిని ఆంధ్రజ్యోతి పలకరించగా తెల్లవారు జాము నుంచే బుక్కులు వరుస క్రమంలో పెట్టి సిబ్బంది వచ్చే వరకు పడిగాపులు కాస్తున్నా మని చెప్పుకొచ్చారు.

నష్ట పరిహారం ఇప్పించాలి

- పత్తి పంటను ధ్వంసం చేసిన ఊరపందులు
- పంచాయతీ కార్యాలయం ముందు రైతు ఆందోళన



పెద్దపోర్ల గ్రామ పంచాయతి ముందు కూర్చొని నిరసన తెలుపుతున్న రైతు మల్లప్ప


ఊట్కూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పత్తి పంటను ఊరపందులు ధ్వంసం చేశాయని, తనకు నష్టపరిహారం ఇప్పించాల ని ఓ రైతు పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టాడు. నారాయణ పేట జిల్లా, ఊట్కూరు మండలంలోని పెద్దపోర్ల గ్రామానికి చెందిన రైతు పోగుల మల్లప్ప తన పొలంతో పాటు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 4 ఎకరాలు లీజుకు తీసు కొని పత్తి పంట సాగు చేశాడు. బుధవారం రాత్రి పొలంలో పందులు చొరబడి పత్తి కాయలు తిని, పంటను పూర్తి ధ్వంసం చేశాయి. గురువారం ఉదయం పొలానికి వెళ్లి చూసిన రైతు ధ్వంసమైన పంటను చూసి ఆవేదనకు గురయ్యాడు. దెబ్బతినగా మిగిలి న పత్తి కాయలను తీసుకొని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశాడు. మక్తల్ గ్రామానికి చెందిన కొందరు తమ పందులను గ్రామంలో వదిలారని, అవి పంటలను ధ్వంసం చేస్తున్నాయని మల్లప్ప తెలిపాడు. నాలుగు ఎకరాల్లో పత్తి సాగుకు ఇప్పటికే రూ. 80 వేల వరకు పెట్టుబడి పెట్టానని చెప్పాడు. అధికారులు స్పందించి పందులను తరలించడంతో పాటు, దెబ్బతిన్న పంటకు నష్టపరిహారం ఇప్పించాలని కోరాడు.

జువైనల్ హోంకు ఐదుగురు బాలురు

జడ్చర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారం సంఘటనలో 5 గురు బాలురను గురువారం జువైనల్ కోర్టులో హాజరు పరిచారు. నాలుగు రోజుల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో తొమ్మిది సంవత్సరా ల బాలికపై ఐదుగురు మైనర్లు అత్యాచారానికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని గురువారం మహబూబ్‌నగర్ జువైనల్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఆదేశం మేరకు వారిని అప్రెహిన్షియల్‌కు పంపించినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు.

రెండు విడతల్లో పల్లెపోరు!

- కసరత్తు ప్రారంభించిన అధికార యంత్రాగం
- ఒకే విడత నిర్వహించాలంటే 10 వేల మంది అవసరం
- జిల్లాలో ఉన్న సిబ్బంది 6 వేల మంది
- నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు



మహబూబ్‌నగర్ జడ్పీ కార్యాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం రాష్ట్రవ్యాప్తంగా ప్రదేశిక, పంచాయతీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించేందుకు నిర్ణయించింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనప్పటికీ, జిల్లాలో ఎన్నికల నిర్వహణపై గత కొద్ది రోజులుగా జిల్లా అధికారులతో ఎన్నికల నిర్వహణపై ప్రతీ రోజు సంప్రదింపులు జరుపుతోంది. జిల్లాలో ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే ఎన్ని బ్యాలెట్ బాక్సులు అవసరం అవుతాయి, ఎంత మంది సిబ్బంది అవసరం అవుతారనే అంశంపై అనెగ్జరీ ఫార్మేట్‌లో నివేదికలు కోరుతోంది. దీంతో జిల్లా యంత్రాగం జిల్లాలో ఏక కాలంలో ఎన్నికలు నిర్వహిస్తే కావాల్సిన బ్యాలెట్ బాక్సులు, అధికారుల సంఖ్యను వారు ఫార్మేట్‌లో ఎన్నికల సంఘం కార్యాలయానికి నివేదించారు. జిల్లాకు 5 వేల పైచిలుకు బ్యాలెట్ బాక్సులు, 10 వేల మంది సిబ్బంది అవసరమవుతారని, ఏక కాలంలో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని వారు ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి విన్నవించారు. దీంతో రెండు విడతల్లో ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించినట్లు సమాచారం. 2 విడతలా, మూడు విడతలా అనే అంశంపై అన్ని జిల్లాల నుంచి అందిన సమాచారం మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

జిల్లాలో పెరిగిన ఓటర్ల సంఖ్య

జిల్లాలో 2019 నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల లో 16 మండలాల పరిధిలో 4,90,938 ఓటర్లు ఉండగా, ప్రభుత్వం నిర్వహించిన రెండు సప్లిమెంట్‌లలో జిల్లాలోని ఓటర్ల సంఖ్య 5,05,808కి పెరిగింది. గతంలో 14 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, నేడు కౌకుంట్ల, మహ్మదాబాద్ మండల కేంద్రాలుగా ఏర్పడడంతో 2 స్థానాలు పెరిగాయి. దీంతో 16 జడ్పీటీసీ స్థానాలకు చేరుకోగా, నూతనంగా మహబూబ్‌నగర్ కార్పొరేషన్, దేవరకద్ర మునిసిపాలిటీలుగా మారడంతో 184 ఎంపీటీసీ స్థానాలు ప్రస్తుతం 175కు తగ్గాయి. 444 గ్రామ పంచాయతీలకు గాను 423 పంచాయతీలకు తగ్గాయి.

ముందుగా ప్రాదేశిక ఎన్నికలు!

పల్లెపోరులో బాగంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకు ఏర్పాట్లను ముమ్మరం చేయాలని జిల్లా పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందుకు అధికారులు ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్‌తో పాటు ఎన్నికల సామగ్రికి టెండర్లను పిలవనున్నారు. జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు ప్రత్యేక బ్యాలెట్ పేపర్‌ను ముద్రించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసి ఉపసంహరణ తర్వాతనే ప్రాదేశిక ఎన్నికల బ్యాలెట్ ముద్రించే అవకాశాలు ఉన్నాయి. ఎంతమంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో పార్టీల గుర్తులపై పోటీ చేసేవారిని, స్వతంత్ర అభ్యర్థులను గుర్తించిన తర్వాతనే అభ్యర్థుల పేర్లు అల్ఫాబెటికల్ ఆర్డరులో బ్యాలెట్ పేపర్ ముద్రించాల్సి ఉంటుంది. ఇందుకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతోనే బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రారంభమవుతుంది.

జీపీ బ్యాలెట్ పేపర్ సిద్ధం

గ్రామ పంచాయతీ ఎన్నికలల్లో పోటీ చేసే అభ్యర్థులకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచు అభ్యర్థులకు, వార్డు సభ్యుల అభ్యర్థులకు వేర్వేరుగా గుర్తులను నిర్ణయించి ముంద్రిస్తోంది. దీంతో గత జనవరి నెలలోనే జిల్లాలో జీపీ ఎన్నికల బ్యాలెట్ పేపర్ ముద్రణ 80 శాతం మేరకు ముద్రణ పూర్తయింది. పూర్తయిన బ్యాలెట్ పేపర్లను స్ట్రాంగ్‌రూంలలో భద్రపర్చారు. ఎన్నికల సామగ్రి కూడా 80 శాతం మేరకు అన్ని మండలాలకు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన సామగ్రిని మండలాలలోని స్ట్రాంగ్‌రూంలలో భద్రపర్చారు.

ప్రాదేశిక పోలింగ్ కేంద్రాలు 922

జిల్లాలోని 16 మండలాల్లోని 175 ప్రాదేశిక స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు 922 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. అందుకు గాను 1,844 బ్యాలెట్ బాక్సులు అవసరం ఉంటాయి. జిల్లా పరిషత్ అధికారులకు బ్యాలెట్ బాక్సులు 3,200 సిద్ధం చేసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా పరిషత్ అధికారులుకు 6,696 మంది సిబ్బంది అవసరాన్ని గుర్తించారు. జిల్లాల్లో వారికి అందుబాటులో 5,300 మంది సిబ్బంది ఉన్నట్లు జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణ అధికారులు వెల్లడిస్తున్నారు. జడ్పీటీసీ బ్యాలెట్ పేపర్ తెలుపు రంగులో ఉండగా, ఎంపీటీసీ బ్యాలెట్ పేపర్ గు లాబీరంగులో ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ వె లువడిన అనంతరం బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ ప క్రియను అధికారులు ప్రారంభించనున్నారు.

ఎలక్టోరల్ నిర్వహిస్తున్నాం : డీపీవో



రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎలక్టోరల్ గ్రామాలలోని వార్డుల వారీగా నిర్వహిస్తున్నాం. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలంటే జిల్లాకు 10 వేల మంది సిబ్బంది అవసరం అవుతారు. రెండు విడతల్లో నిర్వహించాలన్నా, 8 వేల మందిపైగా సిబ్బంది అవసరం అవుతారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని శాఖల్లో ఉన్న సిబ్బంది 6 వేల మంది మాత్రమే ఉన్నారు. దాంట్లో రిటైర్డ్ అయిన వారి సంఖ్యను, మరణించిన వారి సంఖ్యను, వారి స్థానంలో కొత్తగా రిక్రూట్ అయిన వారిని గుర్తిస్తున్నాం. ప్రభుత్వం ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహించాలో, అందుకు మీ జిల్లాలో ఉన్న సిబ్బంది, బ్యాలెట్ బాక్సుల వివరాలు అడిగారు. వాటిని జిల్లాలో ఉన్న శాఖలను సమన్వయం చేసుకుని ఎన్నికల సంఘానికి సమాచారం అందిస్తున్నాం. ప్రభుత్వం చెబితే నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిద్ధంగా ఉన్నారు.

కాశీంనగర్ లిఫ్టు ఇరిగేషన్‌కు జీవో విడుదల

- సర్వే కోసం రూ. 22 లక్షలు మంజూరు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కాశీంనగర్ లిఫ్టు ఇరిగేషన్ పథకం నిర్మాణానికి ప్రభుత్వం జీవో విడుదల చేసిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వనపర్తి పర్యటనకు మచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కాశీంనగర్ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి సర్వే కోసం రూ.22 లక్షలు మంజూరు చేస్తూ జీవో జారీ చేసినట్లు తెలిపారు. తన కోరిక మేరకు ప్రాజెక్టుకు జిల్లెల మాధవరెడ్డి పేరు కూడా పెట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా కాశీంనగర్, జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తాయిపల్లి, అంజనగిరి గ్రామాలతో పాటు 13 తండాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. సర్వే పూర్తి చేసిన తరువాత పరిపాలన అనుమతులు వస్తాయన్నారు. ప్రాజెక్టు పూర్తికి రూ. 62 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనా అని, సాధ్యమైనంత త్వరలో నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. జీవో విడుదల చేసి రైతులకు శుభవార్త తెలిపిన ముఖ్యమంత్రికి, నీటిపారుదల శాఖ మంత్రికి ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కదిరె రాములు, చీర్ల జనార్దన్, సమ్మద్, కోళ్ల వెంకటేశ్, వెంకటేశ్వర్ రెడ్డి, మన్నెం యాదవ్, అబ్దుల్లా పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

- టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.వెంకటేశ్



తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న కార్మికులు

పాలమూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ.9వేలు అమలు చేయాలని టీయూసీఐ (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.వెంకటేశ్, జె.ఎన్ దేవదానం డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్ పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ గడియారం చౌరస్తా, పాతబస్టాండ్‌ల మీదుగా తెలంగాణ చౌరస్తాకు చేరుకున్నది. అనంతరం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, సకాలంలో వేతనాలు, పెన్షన్ అందించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరపకుండా అప్రజాస్వామ్య పాలనను కొనసాగించిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మునిసిపల్, గ్రామపంచాయతీ, ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు నాలుగైదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. పని గంటల పెంపు జీవో నెంబర్ 282 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ రంగాల కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో కె. స్వర్ణరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఆందోళనలో నాయకులు బి.కొండన్న, వెంకట్రాములు, పి.దాసు, డి.అరుణ, బాలు, ఎం.నరసింహులు, శ్రీనివాసులు, ఎం.సతీశ్, వెంకటేశ్‌గౌడ్, కుర్మయ్య, బాలస్వామి, కవిత, రంగయ్య, అంజనేయులు, రామచంద్రయ్య, చెన్నయ్య, షాకీర్, కృష్ణయ్య, షుక్, బాబమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భాష, సాంస్కృతిక సలహా మండలి సభ్యులుగా బాద్మి శివకుమార్, ముచ్చర్ల దినకర్‌రావు



బాద్మి శివకుమార్



ముచ్చర్ల దినకర్‌రావు

జడ్చర్ల/ నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ భాష, సాంస్కృతిక సలహా మండలి సభ్యులుగా జడ్చర్లకు చెందిన బాద్మి శివకుమార్, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ముచ్చర్ల దినకర్‌రావు నియమితులయ్యారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. బాద్మి శివకుమార్ గతంలో తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. సీనియర్ పాత్రికేయుడైన ముచ్చర్ల దినకర్‌రావు వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

అలంపూర్ క్షేత్రంలో అన్నదాన సత్రం ప్రారంభం



హోమంలో పాల్గొని పూజలు చేస్తున్న ప్రముఖులు

అలంపూర్ జూలై 31 (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ క్షేత్రంలో ప్రసాద్ స్కీం ద్వారా నిర్మించిన అన్నదాన సత్రాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నా రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎమ్మెల్యే విజయుడు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత హాజరయ్యారు. అన్నదాన సత్రాన్ని ప్రారంభించిన అనంతరం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అర్చకులు గోపూజ, స్వామి, అమ్మ వార్ల కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం రుద్రహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ సతీ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించి, పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఈవో పురేందర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరిహారం కోసం 15 ఏళ్లుగా ఎదురుచూపులు

- భూత్పూర్ గ్రామస్థుల ఆవేదన



భూత్పూర్ రిజర్వాయర్

మక్తల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పరిహారంకోసం 15 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని నారాయణపేట జిల్లా, భూత్పూర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మక్తల్ మండలంలోని రాజీవ్‌భీమా ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-20లో భాగంగా భూత్పూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. దీని నీటి నిల్వ సామర్థ్యం 1.313 టీఎంసీలు కాగా, 46,800 ఎకరాల ఆయకట్టు నిర్ధారించారు. అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2010 నవంబర్ 3న భూత్పూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించి, జీవో నెంబర్ 122/210 విడుదల చేసింది. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు పరిహారం ఇవ్వకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 983 కుటుంబాలున్నాయి. మొత్తం 18,067 మంది జనాభా ఉన్నారు. గ్రామానికి ఒకవైపు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, రెండు వైపులా ఊర చెరువులు, మూడో వైపు కల్వాల చెరువు, మరో వైపు కుడి కాల్వ ఉండటంతో ప్రతీ ఏడాది వర్షాకాలంలో నీటి ఊట ఉబికి వస్తోంది. ఈ సమస్యతో తాము 15 ఏళ్ల నుంచి ఇబ్బంది పడుతున్నా, ప్రభుత్వం స్పందించడం లేదని చెప్తున్నారు. ప్రతీ వర్షాకాలంలో నాలుగు నెలల పాటు తీవ్రమైన కష్టాలు పడ్తున్నామని, గ్రామంలో ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు కూడా వీలుండటం లేదని వాపోతున్నారు. వర్షాకాలం ఎప్పుడు అయిపోతుందా అని ఎదురు చూస్తున్నామని చెప్తున్నారు.

పునరావాసం కోసం 100 ఎకరాలు



భూత్పూర్‌లో పడిపోయిన ఇల్లు

పునరావాస కేంద్రం ఏర్పాటు కోసం అధికారులు 2015లో బీరప్ప గుడి వద్ద వంద ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. కానీ ఇప్పటి వరకు అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. గ్రామంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి, ఎంత పరిహారం ఇవ్వాలి తదితర అంశాల గుర్తింపునకు సామాజిక సర్వే కూడా పూర్తి చేయలేదు. అసలు పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తారా? లేదా? అని గ్రామస్థులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 2022లో త్రిసభ్య కమిటీ గ్రామాన్ని పరిశీలించించి పునరావాస కేంద్రం ఏర్పాటు తప్పనిసరి అని నివేదిక ఇచ్చినట్లు చెప్తున్నారు. పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని ఇటీవల గ్రామసభ నిర్వహించి గ్రామస్థులు తీర్మానం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని తక్షణమే పునరవాస కేంద్రం ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచు హన్మంతు కోరారు.

అమ్మవారికి 108 కలశాలతో పూజలు



కలశాలతో నీటిని తీసుకొస్తున్న ఆర్యవైశ్యులు

దేవరకద్ర, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలతో పాటు అభిషేకం నిర్వహించారు. ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా 108 కలశాలతో నీటిని తీసుకొచ్చి పూజలు చేశారు.

క్రైం కార్నర్

రెండు బైకులు ఢీకొని రైతు మృతి


బాలయ్య (ఫైల్)

కల్వకుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ రైతు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని గుండూరు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలయ్య (65) గురువారం ఉదయం పొలం వద్ద పాలు తీసుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన శంకరయ్య పెట్రోల్ పోయించుకునేందుకు వస్తున్నాడు. రెండు వాహనాలు గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

» రూ.30,550 స్వాధీనం, నలుగురిపై కేసు

కృష్ణ/ అయిజ జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో రెండు చోట్ల పేకాట రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ వీద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణ రైల్వే స్టేషన్ సమీపంలో, గురజాల గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ నవీద్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30,550 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామంలో పేకాడుతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. 7 వ్యక్తులను అరెస్టు చేసి, కేసు నమోదు చేశామన్నారు. వారి నుంచి 7 సెల్ ఫోన్లు, రూ.12,200 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

» తీవ్రంగా గాయపడిన వ్యక్తి » ప్రాణాలు కాపాడిన హెల్మెట్


రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు, దెబ్బతిన్న స్కూటీ

భూత్పూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు హెల్మెట్ ధరించడంతో ప్రాణాలు దక్కాయి. ఈ సంఘటన గురువారం మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని పోతులమడుగు వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ పట్టణానికి చెందిన మహబూబ్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా హైదరాబాద్ పట్టణంలో ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్నాడు. గురువారం ఉదయం కర్నూలుకు వెళ్లేందుకు స్కూటీపై బయలుదేరాడు. జాతీయ రహదారిపై పోతులమడుగు గ్రామ శివారులో స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొన్నది. ప్రమాదంలో మహబూబ్ ఎడమ చెయ్యి మణికట్టు విరిగింది. అతడి తల డివైడర్‌ను బలంగా తగిలినా హెల్మెట్ ధరించి ఉండటం వల్ల ప్రాణాపాయం తప్పింది. స్థానికులు అతడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెబ్బేరు శివారులో...

పెబ్బేరు (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వనపర్తి జిల్లా, శ్రీరంగాపూర్ మండలం జానంపేట గ్రామానికి చెందిన మైలారం గోపాల్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై గురువారం ఉదయం పెబ్బేరుకు వచ్చాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా పట్టణ శివారులోని మాంటిసోరి పాఠశాల వద్ద వాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అతడిని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

తాగిన మత్తులో చిరుతను పట్టేందుకు..

» ఇద్దరు యువకుల దుస్సాహసం

మహబూబ్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఇద్దరు యువకులు దుస్సాహసానికి ఒడిగట్టారు. ఏకంగా చిరుతను పట్టుకునేందుకు అడవిలోకి వెళ్లి వెతకడం ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీడీ గుట్ట ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులకు గురువారం సాయంత్రం చిరుతపులి కనిపించింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు దానిని పట్టుకుంటామంటూ అడవిలోకి వెళ్లారు. ఈ సంగతి స్థానికులకు తెలియడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు స్థానిక యువకులతో కలిసి అడివిలోకి వెళ్ళి తాగుబోతులను పట్టుకునేందుకు యత్నించారు. వారిలో ఒకరు దొరకగా, మరొకరు తప్పించుకొని పారిపోయాడు. పట్టుబడ్డ యువకుడిని అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా, మహ్మదాబాద్ మండలానికి చెందిన వారని తెలిపాడు. ఆ సమయంలో కొండపైనే ఉన్న చిరుత వారిపై దాడి చేసి ఉంటే పరిస్థితి ఆందోళకరంగా మారేదని అటవీశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. మరోసారి ఇలాంటి జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

మళ్ళీ కనిపించిన చిరుత..

పట్టణంలోని టీడీగుట్ట సమీపంలోని గుట్టపై గురువారం సాయంత్రం చిరుత మళ్లీ కనిపించింది. ఎనిమిది రోజుల క్రితం సీసీ కెమెరా ఫుటేజీలో చిరుత డంపింగ్ యార్డ్ వైపు వెళ్లినట్లు కనిపించింది. మళ్లీ వచ్చినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు కాలేదు. దీంతో అది ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోయినట్లు అధికారులు భావిస్తుండగా, చిరుత మళ్లీ ప్రత్యక్షం కావడం కలకలం సృష్టించింది. సాయంత్రం సమయంలో మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ చిన్నదర్పల్లికి వెళ్తుండగా, స్థానికులు ఆయనకు విషయాన్ని తెలిపారు. దీంతో ఆయన కారు దిగి చిరుతను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార యంత్రాంగం నెలరోజులుగా చిరుతను పట్టుకోలేకపోవడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తం అవుతోందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక బలగాలను తీసుకువచ్చి చిరుతను పట్టుకుని అడవిలో వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో చోరీ

చిన్నచింతకుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని మద్దూరు గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో ప్రవేశించి హుండీని ధ్వంసం చేసి, అందులోని రూ. 10వేలతో పాటు, స్వామి వారి వెండి కన్నులు, కోరమీసం, నామాన్ని ఎత్తుకెళ్లారు. రాత్రి భజన చేసేందుకు వెళ్లిన భక్తులకు ఆలయం తాళం విరిగిపోయి ఉండటం, స్వామి వారి వెండి ఆభరణాలు కన్పించకపోవడంతో గ్రామస్థులకు సమాచారం అందించారు. అనంతరం స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూగ జీవాలకు అందని వైద్యం

» మందులకు అరకొర నిధులు
» వైద్యులు, సిబ్బంది కొరతతో ఇక్కట్లు
» ఇబ్బంది పడుతున్న పశు పోషకులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మూగ జీవాలకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. పశు వైద్య కేంద్రాల్లో మందుల కొరతకు తోడు, అవసరమైన వైద్యులు, సిబ్బంది లేకపోవడం ఇబ్బందిగా మారింది. వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల కొరత నెలకొన్నది. దీంతో పాడి రైతులు ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్తున్నా, క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.


పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు



పాలమూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పశువులకు సరైన వైద్యం అందడం లేదు. పశువైద్య శాఖలో వైద్యులతో పాటు, సిబ్బంది కొరత ఇబ్బందిగా మారింది. దీనికి తోడు మందుల కొరతతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వ్యాధుల బారిన పడిన మూగ జీవాలను ఆసుపత్రికి తీసుకువెళ్తే మందులు లేవని చెప్తూ, ప్రైవేట్ మెడికల్‌షాపుల్లో తెచ్చుకోవాలని చీటీలు రాసి ఇస్తున్నారు. ప్రైవేటులో మందుల ధరలు రైతులకు ఆర్థిక భారంగా మారుతున్నాయి.

అరకొర మందులు

వ్యాధుల బారినపడిన మూగ జీవాలకు అవసరమైన మందులు అందుబాటులో లేవు. గొర్రెలు, మేకలకు సంబంధించిన మందులు, ఇంజక్షన్లను రైతులు బయట మార్కెట్‌లో కొనాల్సి వస్తోంది. నట్టల నివారణ మందులను ఏడాదికి మూడు/నాలుగు విడతలుగా ఇవ్వాల్సి ఉండగా, ఈ సంవత్సరం ఒక్కసారి ఇవ్వలేదు. ఆవులు, గేదెలకు కాల్షియం సప్లిమెంట్లు అరకొరగానే ఉన్నాయి. పశువులకు కుక్కకాటు ఇంజక్షన్లను ప్రభుత్వం నామమాత్రంగా పంపిణీ చేస్తోంది. యాంటి ఎస్ట్‌మెంట్, యాంటి డయేరియా మందులు, ఈత తరువాత పశువులకు ఇవ్వాల్సిన ఎడ్‌బోలిక్ మందులు, డీ-25 సెలైన్ బాటిళ్లు అంతంత మాత్రంగానే అందుబాటులో ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పశువైద్యశాలలో టీకాలు తప్ప ఇతర మందులు లేవు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నట్టల నివారణ మందులు మూడేళ్లుగా పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు.

పాలమూరు జిల్లాలో 71 పశువైద్యశాలలు

పశువైద్యులు అందుబాటులో లేక పాడి రైతులు, పశు పోషకులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో బహుళార్థక పశువైద్యశాల 1, నియోజకవర్గ స్థాయి పశువైద్యశాల 1, ప్రాథమిక పశువైద్య కేంద్రాలు 26, గ్రామీణ పశువైద్య కేంద్రాలు (సబ్‌సెంటర్లు) 42, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం 1, మొత్తంగా 71 వైద్య శాలలు ఉన్నాయి. పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు 30 మంది ఉండగా, మరో 20 మంది అవసరం ఉన్నారు. పారా మెడికల్ వెటర్నరీ సిబ్బంది (వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్) 68 మందికి గాను 55 మంది ఉన్నారు. అటెండర్లు 70 మందికి గాను 59 మంది పనిచేస్తున్నారు. మరో 40 మంది అటెండర్లను నియమించాల్సి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 80,310 ఆవులు, 74,447 గేదెలు, 8,86,575 గొర్రెలు, 1,10,572 మేకలతో పాటు 55 లక్షల ఫారం, దేశవాళీ కోళ్లు ఉన్నాయి. రైతులకు పశుగ్రాస విత్తనాలు, సబ్సిడీపై దాణా ఇస్తే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని చెప్తున్నారు. అలాగే పాలు, మాంసం దిగుమతి ఉత్పత్తి పెరుగుతుందని అంటున్నారు.

మందులు లేక ఆవు చనిపోయింది



మా ఆవును నెల క్రితం కుక్క కరిచింది. పశువైద్య శాలకు తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. అక్కడ యాంటి రేబిస్ ఇంజక్షన్ లేకపోవటంతో ఆవు చనిపోయింది. పశువైద్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలి.

- వెంకటన్న,
పశువుల కాపరి, నవాబ్‌పేట

సిబ్బంది కొరత వాస్తవమే



ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందులు, సిబ్బంది కొరత వాస్తవమే. ప్రభుత్వం ప్రతీ మూడు నెలలకు ఒక సారి రూ. 44 లక్షల విలువైన మందులను సరఫరా చేస్తోంది. వాటితో పాటు మరో కోటి రూపాయల విలువైన మందులను పంపిస్తే జిల్లా లోని అన్ని రకాల పశువులు, మేకలు, గొర్రెలు తదితరాలకు సంపూర్ణంగా వైద్య సేవలు అందించగలం. ప్రస్తుతం వానాకాలానికి సంబంధించిన టీకాలను పశువులకు వేయించాం. నట్టల నివారణ మందుల సరఫరా లేదు.

మధుసూదన్‌గౌడ్, జిల్లా పశువైద్య,
పశుసంవర్థక అధికారి, మహబూబ్‌నగర్

బీసీలకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

» సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ

అచ్చంపేట టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలోని టీఎన్‌జీవో భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొచ్చి, ప్రత్యేకంగా అమలు చేసుకొనే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయంపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, గుజరాత్‌లలో రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం కల్పించిన కేంద్ర ప్రభుత్వం, మన రాష్ట్రంలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడాన్ని పార్టీ స్వాగతిస్తోందన్నారు. పాకిస్థాన్, ఇండియా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులో సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దేశ్యానాయక్, నాయకులు వెంకట్రాములు, ధర్మానాయక్, శంకర్ నాయక్, నాగరాజు, సైదులు, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమీ లేదు

» మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

ధన్వాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ధన్వాడతో పాటు, మండలంలోని గ్రామాల్లో నేను చేసిన అభివృద్ధి తప్ప, కాంగ్రెస్ పార్టీ కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ లేదని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊరి ఆడబిడ్డలుగా చెప్పకునే ఎంపీ అరుణ, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ధన్వాడకు చేసిందేమీ లేదన్నారు. అత్తా కోడల్లు ఒక్కటై ఒప్పందం ప్రకారం ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం అయ్యారని, రానున్న స్థానిక ఎన్నికల్లో కసి తీర్చుకోవడం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, చాకలి చంద్రశేఖర్, జుట్ల సత్యనారయణగౌడ్, వడ్ల శాంతికుమార్, శివారెడ్డి, ఇర్ఫాన్ అహ్మద్ పాల్గొన్నారు.

కొమ్మల కత్తిరింపుతో అధిక దిగుబడులు

» ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బాబు
» ఉమ్మడి జిల్లా రైతులకు క్షేత్రస్థాయిలో శిక్షణ



ఉమ్మడి జిల్లా మామిడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ డైరెక్టర్ బాబు

కొల్లాపూర్ , జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మామిడి కొమ్మల కత్తిరింపుతో అధిక దిగుబడులు పొందొచ్చని ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బాబు రైతులకు సూచించారు. మామిడి కొమ్మలు కత్తిరించడం, పునరుద్ధరణపై ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ నేతృత్వంలో, ప్రసాద్ సీడ్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు గురువారం క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని అంకిరావుపల్లి శివారులో మామిడి రైతు వెంకట్రాంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మామిడి కొమ్మ కత్తిరింపు విధానాన్ని వారికి చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఆగస్టులోపు కొమ్మలు కత్తిరించాలని సూచించారు. ఆ తర్వాత చెట్టు వయసును బట్టి ఎరువులను వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వేణుగోపాల్, విజయభాస్కర్‌రెడ్డి, అక్బర్, వెంకటేశం, డాక్టర్ ఎం.లక్ష్మణ్, శాస్త్రవేత్తలు డాక్టర్ హరికాంత్, డాక్టర్ ఆదిశంకర్ డాక్టర్ శైలప్రసాద్, సీడ్ రిస్క్ మేనేజర్ భూపేష్ కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదు

» యునైటెడ్ ఫూలే ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ విజేందర్‌సాగర్


వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కల్వకుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని యునైటెడ్ ఫూలే ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ విజేందర్‌సాగర్ విమర్శించారు. ఆ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈ నెల 4, 5, 6వ తేదీల్లో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 72 గంటల నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆయన పట్టణంలోని వైఆర్‌ఆర్ కాంప్లెక్స్‌లో గురువారం విడుదల చేశారు. దీక్షకు కల్వకుర్తి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని బీసీలందరూ తరలిరావాలని కోరారు. అనంతరం బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు ధారమోని గణేశ్, మహిళా కన్వీనర్ చిలుక మంజులారెడ్డి, ఉపాధ్యక్షురాలు మేకల మంజుల, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుశీల, నాయకులు శేఖర్‌గౌడ్, అనిల్, శ్రీనివాసులు, సాధిక్, పార్వతి, సాగర్, మనీషా పాల్గొన్నారు.

కోస్గి ఇంజనీరింగ్ కళాశాలలో అందుబాటులో బీటెక్ సీట్లు

కోస్గి/ వడ్డేపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కోస్గి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్‌సీ), డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్, మెసిన్ లెర్నింగ్ కోర్సులున్నట్లు తెలిపారు. ఇది వరకు రెండు కౌన్సిలింగ్‌లలో సీట్లు అలాట్ అయ్యాయని తెలిపారు. మూడవ కౌన్సిలింగ్‌కు 5 నుంచి 9వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

అలాట్‌మెంట్ అయిన తర్వాత సీట్లు మిగిలితే ఆగస్టు 25 నుంచి స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతీ కోర్సులో 66 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కూడా ఉంటుందని పేర్కొన్నారు.


ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

సాగుబడిలో పాఠాలు

బిజినేపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని పాలెం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సాగు బడిలో పాఠాలు నేర్చుకుంటున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని ప్రదర్శన మడిలో గురువారం తాడుపట్టి వరి నాట్లు వేయడంపై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఏడీఆర్ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్) డాక్టర్ రాంప్రకాశ్ మాట్లాడుతూ తరగతి ప్రొఫెసర్లు నేర్పించిన అంశాలను విద్యార్థులు క్షేత్ర స్థాయిలో ప్రయోగాత్మకంగా చేయడం, పరిశీలించడం ద్వారా వారి కి సంపూర్ణ అవగాహన కలుగుతుందన్నారు.

వివిధ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు, పంటకాలం, ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, పెట్టుబడి, దిగుబడి, ఆదాయం తదితర విషయాలపై అవగాహన కలుగుతుందని చెప్పారు.

ఇంటర్వ్యూ..

మూగ జీవాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రవీణ్‌కుమార్, వెటర్నరీ వైద్యుడు



తాడూరు,జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వర్షాకాలం కావడం మూలంగా నిరంతరాయంగా తరచూ వర్షాలు కురుస్తుంటాయి. ఈ నేపథ్యంలో మూగ జీవాలైన పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు పచ్చగడ్డి తింటూ వాతావరణ మార్పుల కారణంగా అనేక వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వెటర్నరీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గొర్రెల, మేకల పెంపకందారులతో పాటు పశువులు, గేదెలను పెంచే రైతులు ముందస్తుగా వాటికి టీకాలు వేయించాలని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో కోరారు.

ప్రస్తుతం పశువులు, మేకలు, గొర్రెల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలుతున్నాయి?

ప్రస్తుతం గొర్రెలు, మేకల్లో నీలి నాలుక వ్యాధి ప్రబలుతోంది. దీంతో అవి మేత మేయకుండా నీరసంగా ఉండి చనిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వాటి నివారణకు సంబంధించి ప్రస్తుతం అన్ని గ్రామాల్లో నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నాం. కాపరులు తమ మేకలకు, గొర్రెలకు తప్పనిసరిగా ఈ టీకాలు వేయించాలి.

మండల వ్యాప్తంగా ఎన్ని మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు?

మండల కేంద్రంతో పాటు మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 33వేల గొర్రెలు, మేకలు ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకు భలాన్‌పల్లి, తాడూరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో దాదాపు 8వేల గొర్రెలకు, మేకలకు టీకాలు వేశాం.

కాపరులకు మీరిచ్చే సూచనలు ఏమిటీ?

పొలాల్లో పచ్చగడ్డిని పశువులు ఇష్టంగా తింటాయి. వీటితో పాటు తాగే నీళ్లు సైతం కలుషితమవుతాయి. ఈ నేపథ్యంలో గొర్రెలు, మేకలతో పాటు పశువులకు, గేదెలకు వైరల్ వ్యాధులు ప్రబలి వాటిని తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసి తీవ్ర సమస్యగా మారి చనిపోయే సమస్యలు సైతం నెలకొంటాయి. పశు వైద్యాధికారిని సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అదేవిధంగా వర్షాకాలం, వేసవి కాలం, చలికాలం ఇలా మూడు దఫాలుగా పశువులకు, గొర్రెలకు, మేకలకు, గేదెలకు ముందస్తు వ్యాధి నిరోధక శక్తి పెంచేనివారణ టీకాలను వేయించినట్లయితే ఇలాంటి సమస్యలను అధిగమించవచ్చు.

న్యూస్ బాక్స్

ఆస్పత్రిలో ఆచారి పరామర్శ

కల్వకుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన శంకరయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి కల్వకుర్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న శంకరయ్యను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, గుండూరు మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి ఉన్నారు.

వసతి గృహం తనిఖీ

వెల్దండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల వసతిగృహాన్ని గురువారం మండల వైద్యాధికారి సింధు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళీకృష్ణ, సమిత, ఆరోగ్య కార్యకర్త జహంగీర్‌బీ, ఆశావర్కర్లు పద్మ, అనిత, బాలమణి ఉన్నారు.

'అవగాహన కలిగి ఉండాలి'

చారకొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండి సమాజంలో ఇతరుల హక్కులకు భంగం కలిగించవద్దని ఆర్ఐ భరత్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మర్రిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్ఐ భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండి అంటరానితనాన్ని రూపుమాపాలని అన్నారు. కులమతాలకు అతీతంగా మెలగాలని అన్నారు. మూఢనమ్మకాలు, మూఢవిశ్వాసాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ద్యావ కేశవరెడ్డి, సురేష్‌నాయక్, వెంకటయ్య, గణేష్, అంజన్‌రెడ్డి, బక్కయ్య పాల్గొన్నారు.

'డీలర్‌పై చర్యలు తీసుకోవాలి'

కల్వకుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారని అతనిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ ఇబ్రహీంకు గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయాల్సిన డీలర్ ఓ పార్టీలో గ్రామ అధ్యక్షునిగా ఎండడం ఎంత వరకు సమంజసమని వారు వినతిలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బీజేపీ నాయకులు రాజశేఖర్, మల్లయ్య, రాంరెడ్డి, జంగయ్య, లక్ష్మయ్య, యాదయ్య ఉన్నారు.

బీరప్ప దేవాలయానికి విరాళం

వెల్దండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న బీరప్పస్వామి దేవాలయానికి గ్రామానికి చెందిన అన్నదానం సంతోష్ రూ.50వేల విరాళాన్ని గురువారం నిర్వాహకులకు అందజేశారు. దేవాలయ అభివృద్ధికి సహకరిస్తానని సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిందం కృష్ణయ్య, తంబాలుయాదవ్, కుమార్, శ్రీధర్, జంగయ్య, రామకృష్ణ, మల్లేష్ ఉన్నారు.

విలీన గ్రామం.. అస్తవ్యస్తం

ఆంధ్రజ్యోతి వార్డు వాచ్

- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- నాలుగు రోజులకోసారి తాగునీటి సరఫరా
- ఇళ్ల మధ్య పెరిగిన కంపచెట్లు
- ఒకటవ వార్డులోని విలీన గ్రామం ఎండబెట్ల దుస్థితి

కందనూలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విలీన గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో అస్తవ్యస్తమైన రోడ్లు దర్శనమిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామాన్ని మునిసిపాలిటీలో విలీనం చేశారు. ఆ గ్రామానికి ఒకటవ వార్డుగా నమోదు చేశారు. వార్డు పరిధిలో బండమీది కాలనీలో రోడ్లు, డ్రైనేజీ లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. నాలుగు రోజులకొకసారి తాగునీటి సరఫరా చేస్తున్నారని అవి కూడా సరిపోను రాకపోవడంతో బిందెలు తీసుకొని నీటి కోసం నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వార్డులో రోడ్లపై మురుగునీరు పారుతుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దళిత వాడలో రోడ్లు డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. తమ సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో తామున్నామని వారు పేర్కొంటున్నారు. గ్రామంలో ఇళ్ల మధ్యలో రోడ్లు అడవిలా తలపిస్తున్నాయని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయని ప్రజలు వాపోయారు. గ్రామంలో వీధి దీపాలు పగలేవెలుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏదే మైనా నాగర్‌కర్నూల్ పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఎండబెట్ల గ్రామాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మునిసిపాలిటీ అధికారులు తక్షణమే గ్రామంలో రోడ్లపై పారుతున్న మురుగునీటిని తొలగించి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరుకుంటున్నారు. ఇళ్ల మధ్యలో రోడ్డుకిరువైపులా వాలిన కంపచెట్లను తొలగించి రాకపోక లకు అంతరాయం లేకుండా చేయాలని గ్రామస్థులు కోరారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు



ఇళ్ల మధ్యన ఏపుగా పెరిగిన కంపచెట్లు

తాగునీరు రావడం లేదు



ఎండబెట్ల గ్రామంలో బండమీది కాలనీ నాలుగు రోజులకొకసారి నీరు సరఫరా చేస్తున్నారు. అవి కూడా సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నీటి కోసం బిందెలు పట్టుకుని పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మా కాలనీలో రోడ్డు సక్రమంగా లేక రోడ్లపైనే మురుగు నీరు పారుతున్న అధి కారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

- మంగ లక్ష్మమ్మ, ఎండబెట్ల

భూ భారతి వినతులకు పరిష్కారం చూపాలి

- ఆర్డీవో సురేష్ కుమార్

బిజినేపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వివిధ భూ సమస్యల పరిష్కారానికి భూ భారతిలో సమర్పించిన వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని ఆర్డీవో సురేష్‌కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చే రైతు లకు, విద్యార్థులకు, ప్రజలకు అవసరమైన సేవలను సకాలంలో అందించేలా అందుబాటులో ఉండాలని అన్నారు. అనవసరంగా కుంటిసాకులు చెప్పి కాలయాపన చేయడంతో పాటు పదే పదే కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దని హెచ్చరించారు. తహసీల్దార్ మునీరుద్దీన్, నాయబ్ తహసీల్దార్ రవి కుమార్, ఆర్ఐలు బాలరాజు, భారతిబాయి, జూనియర్ అసిస్టెంట్లు కృష్ణవేణి, అరుణ, మాధవి, రాఘవేందర్, భగవంత్ సాగర్, రమేష్ ఉన్నారు.



బిజినేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో సురేష్ కుమార్

రామాలయంలో జాలి ఏర్పాటుకు విరాళం

మన్ననూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు అంబేడ్కర్ కాలనీలోని రామాలయం చుట్టూ ఇనుప జాలీ ఏర్పాటు కోసం సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ ఆలయ కమిటీ సభ్యులకు రూ.1.15లక్ష నగదు విరాళాన్ని గురువారం అందజేశారు. ఆలయంలోకి కోతులు ప్రవేశించి ఇబ్బంది పెడుతున్నట్లుగా ఆలయ కమిటీసభ్యులు ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులకు తెలియజేయగా, స్పందించిన వారు అచ్చంపేట లోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం నగదును అందజేశారు.



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న అనురాధ

సులభతర బోధనతో విద్యాప్రమాణాల పెంపు

- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్

వెల్దండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభతర బోధన చేస్తేనే విద్యాప్రమాణాలు మెరుగుపడి ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ సూచించారు. గురువారం మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. గత ఏడాది ఇంటర్, పదవ తరగతిలో వచ్చిన ఉత్తీర్ణత శాతాన్ని ప్రిన్సిపాల్ శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాబోవు వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ ఉన్నారు.



మోడల్ స్కూల్‌లో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఈవో రమేష్

కొనసాగిన పదవీ విరమణ కార్యక్రమం

వెల్దండ : మండల పరిధిలోని పెద్దాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఆండాలు పదవీ విరమణ గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో రమేష్‌కుమార్, ఎంఈవో చంద్రుడు హాజరై ఆండాలును శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయురాలిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాది యుగంధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, రవీందర్ ఉన్నారు.

దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మికత వ్యాప్తి

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ గ్రామంలో దేవాలయాల నిర్మాణాలు, నిత్యపూజలు జరిగినప్పుడే ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కుందారం తండాలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయ దేవాలయ విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి మొదటి విడతగా లక్ష రూపాయల చెక్కును నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి ప్రధాన దాతలు తండాకు చెందిన రాత్లావత్ మోతీలాల్, సునీత దంపతులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కవిత, మాజీ సర్పంచ్ లోక్యానాయక్, నాయకులు గన్యానాయక్, మహేష్, కరుణాకర్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, అంజయ్య, నాగయ్య, మల్లేష్, బాలునాయక్, సవేందర్, లోకేష్, భగ్య, సోమ్లా, శంకర్, నవీన్, సురేష్, ప్రవీణ్ ఉన్నారు.



ఆలయ అభివృద్ధికి చెక్కు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

యూరియా కొరత లేదు

ఉప్పునుంతల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రైతులు అధైర్య పడవద్దని, యూరియా కొరత లేదని అచ్చంపేట వ్యవసాయ సంచాలకుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయాధికారి రమేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆగ్రో షాపులతో పాటు పీఏసీఎస్‌లో ఉన్న యూరియా నిలువలను పరిశీలించారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాతినిథ్యం కల్పించాలి'

కల్వకుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ ఇబ్రహీంకు దివ్యాంగులు వినతి పత్రం అందజేశారు. స్థానిక సంస్థల్లో ఛత్తీస్‌ఘడ్, రాజస్తాన్, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో కూడా అమలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో దివ్యాంగుల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య, కల్వకుర్తి మండల కన్వీనర్ రవి, మండల సలహాదారుడు స్వామి, దివ్యాంగులు షేక్ బురాన్, లక్ష్మయ్య ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ఊర్కొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. గురువారం మండలంలోని ఊర్కొండపేట, గుండ్లగుంటపల్లి, రెడ్యా తండాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేసిన వారికి మొత్తం బిల్లులు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. హౌసింగ్ ఏఈ తరుణ్, ఎంపీవో లక్ష్మణ్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు ఇబ్రహీం, సాయిరూప ఉన్నారు.

నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలి

తిమ్మాజిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ఖాజా లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని హనుమాన్‌తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు గురువారం ఆయన లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు.

పేద విద్యార్థులకు మెరుగైన విద్య

వంగూరు జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లతో మండలంలోని విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనుందని ఎంఈవో మురళీమోహనాచారి అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఎంపికైన వంగూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఖాళీ స్థలంలో ముళ్ల చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో శశాంక్‌రెడ్డి, లింగమయ్య పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి భట్టిని కలిసిన ఎమ్మెల్యే

- 220/33 కేవీ సబ్ స్టేషన్ కోసం విజ్ఞప్తి

అచ్చంపేటటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో 220/33 కేవీ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కలిశారు. గు రువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మర్యాదపూరకంగా కలిసి నియోజకవర్గ సమస్య లపై చర్చించారు. అదేవిధంగా అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని పుస్తకంతో పాటు కరపత్రాన్ని ఆవిష్కరించారు.



ఉప ముఖ్యమంత్రితో కలిసి అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి

- టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు

కల్వకుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో గురువారం సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి లక్ష్మీనరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్ తీసుకొచ్చి భరోసా లేకుండా చేశారని విమర్శించారు. సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాలో జరిగే రోష్ మార్చ్‌ను ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోతే ఆగస్టు 23 నుంచి వివిధ రూపాల్లో తమ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వేముల సైదులు, టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, వివిధ మండలాల బాధ్యులు స్వామి, రాములు, మల్లేష్, రవీందర్, వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

మిస్సింగ్ క్రెడిట్స్ జమ చేయాలి

ఉప్పునుంతల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం సీపీఎస్ ఉద్యోగుల మిస్సింగ్ క్రెడిట్‌పై ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి అవగాహన కల్పించారు. 2004 సెప్టెంబరు 1 నుంచి జాయిన్ అయిన ఉద్యోగులకు సీపీఎం మిస్సింగ్ క్రెడిట్ చాలానే ఉన్నాయని, వాటిని ఎన్ఎస్‌డీఎల్ యాప్ ద్వారా తెలుసుకొని డీడీవో ద్వారా జమ చేసుకునే అవకాశం ఉందన్నారు. నూతన పెన్షన్ విధానం అనేది ఉద్యోగుల పాలిట శాపమని జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ అన్నారు. పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపతహసీల్దార్ పరశునాయక్, ఆర్ఐ రామకృష్ణ, బలరాం, టీఎన్జీవో నాయకులు గణేష్, సీపీఎస్ ఉద్యోగులు చందర్, లక్ష్మణ్, వెంకటేస్, ఆదిత్య తదితరులు ఉన్నారు.

పది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

అమ్రాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉమ్మడి మండల పరిధిలోని ముగ్గురు విద్యార్థులకు అమ్రాబాద్ జడ్పీ హెచ్ఎస్‌లో గురువారం నగదు బహుమతితో పాటు మెడల్స్‌ను అందించారు. పోల లక్ష్మమ్మ, పాపిశెట్టి లింగమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ బహుమతులను అందజేశారు. పదర మండల పరిధిలోని వంకేశ్వరం విద్యార్థి ఏ రాకేష్‌కు మొదటి బహుమతి 5000, పదర జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సీహెచ్ శ్రీనివాస్‌కు రెండవ 3000, అమ్రాబాద్ జడ్పీ హెచ్ఎస్ విద్యార్థిని శివానికి మూడవ బహుమతిగా రూ.2000 నగదును అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలకిషన్, ఉపాధ్యాయులు నిరంజన్, గోపాలు, రాఘవేందర్, క్లాస్‌మేట్‌క్లబ్ ప్రతినిధులు కామిశెట్టి శ్రీనివాసులు, పోల శ్రీనివాసులు, సంబు వెంకటరమణ, సత్య నారాయణ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు జడ్పీహెచ్ఎస్‌లో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

ర్యాగింగ్ వల్ల విద్యార్థుల్లో మానసిక క్షోభ

- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మధుసూదన్‌రావు

కందనూలు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్ వల్ల విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతారని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మధుసూదన్‌రావు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సెక్రటరీ ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడు తూ ముఖ్యంగా పాఠశాల చదువు పూర్తైన తర్వాత ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్ కాలేజీల్లో, మెడికల్ కాలేజీల్లో ఎక్కువగా కన్పిస్తుందన్నారు. ర్యాగింగ్ వల్ల చాలా మంది విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతారన్నారు. ప్రతీ కాలేజీలో ర్యాగింగ్ గురించి ఒక కమిటీ ఉంటుందని, ఎవరైనా ఆ కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని, లేదా 100కు డయల్ చేయవచ్చని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, డ్రెస్సులు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తుందని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవికుమార్, న్యాయవాదులు బి.రామచందర్, పవన శేషసాయి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంస్థ ఉద్యోగులు ఎం.కేశవరెడ్డి, ఎస్.రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రావు

పోలీసు గస్తీ నిరంతరం నిర్వహించాలి

- కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి



కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి

కల్వకుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను, కేసుల ఛేదింపును క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ పట్టణం, గ్రామాల్లో ఎక్కడా దొంగతనాలు జరగకుండా పోలీసులు గస్తీ నిర్వహించాలని, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. తనిఖీ సమయంలో కల్వకుర్తి సీఐ బి.నాగార్జున, ఎస్ఐ జి.మాధవరెడ్డి, ఏఎస్ఐలు హనుమంతురెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీలో ఎంఈవో విచారణ

పెంట్లవెల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో బుధవారం ఉదయం బియ్యం అక్రమంగా ఆటోలో తరలించారని స్థానికులు ఎంఈవోకు సమాచారం ఇవ్వడంతో పాఠశాల ఎస్ఓ సువర్ణను, అదే విధంగా వంట విధులు నిర్వహించే సిబ్బందిని విచారించారు. ఎస్ఓ మాట్లాడుతూ పాఠశాల మొత్తం తీర్మానంతో బియ్యం ముక్కిపోయి పురుగు పట్టడంతో పారబోయకుండా పందుల కోసమని పెంపకందారులు తీసుకెళ్లారన్నారు. ఏదైనా చేసేటప్పుడు పై అధికారులకు తెలియజేయాలని ఎంఈవో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొల్లాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గ్రామాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ ఉమేష్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 33 కేవీ కొల్లాపూర్ పరిధిలోని కుడికిల్ల లైన్‌లో చెట్లు కొట్టేందుకు, లూజ్ లైన్ కింద స్తంభాలు, నాటడానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కొల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని వచ్చే గ్రామాలు కొల్లాపూర్ టౌన్, రామాపురం, సోమశిల, బోయలపల్లి, మాచినేనిపల్లి, పెంట్లవెల్లి, మల్లేశ్వరం, మంచాలకట్ట, యంగంపల్లి, మాధవస్వామి నగర్, కుడికిల్ల సబ్ స్టేషన్ పరిధిలోకి వచ్చే గ్రామాలు కుడికిల్ల, చుక్కాయిపల్లి, అంకిరావుపల్లి గ్రామాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు వినియోగదారులు సహకరించగలరని కోరారు.


హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గిరిజన శాఖ, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో హైదరాబాదు పబ్లిక్ స్కూల్ 2025-26 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో ప్రవేశాలకు ఆగస్టు 8లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయా శాఖల అధికారులు కోరారు. ఈ మేరకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పి.యాదమ్మ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాంలాల్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రవేశం కోరే విద్యార్థులు 1 జూన్, 2018 నుంచి 31 మే 2019 మధ్య జన్మించి ఉండాలని, అలాగే విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతానికి చెందిన వారికి రూ.2 లక్షలు మించరాదని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు బేగంపేట, రామంతాపూర్‌లోని హైదరాబాదు పబ్లిక్ స్కూల్స్‌లో ప్రవేశాలు కల్పించనున్నామని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన జిల్లాలోని గిరిజన విద్యార్థులు వారి కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలతో నిర్దేశించిన తేదీలోగా కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమశాఖ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయాలలో దరఖాస్తును సమర్పించాలని వారు కోరారు.

ఆరోగ్యకర వరి నారును ఎంచుకోవాలి

- రైతులకు సూచించిన రావేఫ్ విద్యార్థినులు

తిమ్మాజిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరోగ్యకరమైన వరి నారును ఎంచుకోవాలని రావేఫ్ విద్యార్థినులు సూచించారు. మండల పరిధిలోని చేగుంటలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం వరి నాట్లు జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి వివరించారు. వరి పొలంలో నాటే ముందు నారు కొనలను ఉంచాలన్నారు. ఆకు చివరలను ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల వరకు క్లిప్పింగ్ చేసి పది నిమిషాల పాటు బ్లీచింగ్ పౌడర్‌లో నానబెట్టాలని సూచించారు. మొక్కల మధ్య దూరం పాటించాలన్నారు. రావేఫ్ విద్యార్థినులు సాయి, శరణ్య, ఐశ్వర్యయ్య, పూజిత, హరిప్రియ, నందిని, అనిత ఉన్నారు.



చేగుంటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు